సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



ఏమైందో ఏమో..?

ఆమదాలవలస రైల్వేస్టేషన్ సమీపంలో పాలిటెక్నిక్ విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కారణాలు తెలియాల్సి ఉంది.

- 8లో



మళ్లీ విజిలెన్స్ దాడులు

అరసవల్లి ఆదిత్యాలయంలో మళ్లీ విజిలెన్స్ దాడులు జరిగాయి. నిధుల వినియోగం, జీతభత్యాల చెల్లింపులపై ఆరా తీస్తున్నారు.

- 8లో



దివ్యాంగుడైన ఢిల్లీని సినిమాకు తీసుకెళ్లి థియేటర్ నుంచి వస్తున్న స్నేహితుడు శంకర్

న్యూస్‌రీల్

మహిళల భద్రతే ముఖ్యం

శ్రీకాకుళం క్రైమ్ : మహిళల భద్రతే తమ మొదటి ప్రాధాన్యమని.. స్త్రీలు, బాలికలపై జరిగే నేరాలు, చట్టాలు, శిక్షలపై ప్రజలకు నిత్యం పోలీసులు అవగాహన కల్పిస్తున్నారని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. సైబర్ మోసాలు, గంజాయి, మద్యం వల్ల కలిగే అనర్థాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నివారణా చర్యలను క్షేత్రస్థాయిలో వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆపద సమయంలో డయల్ 112, శక్తియాప్, చైల్డ్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, సైబర్ టోల్‌ఫ్రీ 1930 నంబర్లు ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు. గంజాయి క్రయ విక్రయాలు, రవాణా సమాచారాన్ని ఈగల్ 1972 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. ర్యాష్ డ్రైవింగ్ చేసి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని యువతకు హితవు పలికారు.

ఖాదీ విశిష్టతను యువత గుర్తించాలి



ఖాదీ వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దంపతులు

పొందూరు: ఖాదీ వస్త్రాల విశిష్టతను యువత గుర్తించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పొందూరు ఏఎఫ్‌కేకే సంఘం, సాయిబాబా వీవర్స్ సొసైటీలను శనివారం సతీమణితో కలిసి కలెక్టర్ సందర్శించారు. యువతను ఆకట్టుకునేలా ఆధునిక డిజైన్‌లతో ఖాదీ వస్త్రాల రూపకల్పన చేయాలని నేత కార్మికులకు సూచించారు. పత్తి నుంచి వస్త్రం తయారయ్యే పద్ధతిని సిబ్బంది వివరించారు. అనంతరం ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేశారు. ఆయనతో పాటు ఏఎఫ్‌కేకే సంఘం అధ్యక్షుడు కామేశ్వరప్రసాద్, సెక్రటరీ దండా వెంకటరమణ తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు
- అన్నదాత సుఖీభవ నిధులు విడుదల



చెక్కును ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

ఎచ్చెర్ల : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం లావేరు మండలం తాళ్లవలస రైస్ గొడౌన్ వద్ద అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు ఏడాదిలో మూడు విడతలగా రూ.20 వేలు అందించనున్నామని చెప్పారు. మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు కలిపి మొత్తం రూ.7 వేలు జమ చేసినట్లు వివరించారు. జిల్లాలో 2.7 లక్షల మందికి రూ.182 కోట్లు ఇవ్వనున్నామని తెలిపారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో 48,103 మంది రైతులకు రూ.32 కోట్లు అందిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ పథకానికి ఇంకా దరఖాస్తు చేసుకోని రైతులు సచివాలయంలో సంప్రదించాలన్నారు. రుణాలను కొత్తగా తీసుకుంటే రూ.160 చెల్లించి బీమా పొందాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో ప్రత్యూష, టీడీపీ నాయకులు చౌదరి నారాయణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



‘స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం’ అని ఓ సినీ కవి అన్నట్లు స్నేహబంధం ఎప్పటికీ మనతోనే ఉంటూ మన జీవితంలో భాగమవుతుంది. పుట్టినప్పుడు మనతోపాటు ఎన్నో బంధాలు, రక్త సంబంధాలు ఏర్పడతాయి. తర్వాత మన నడవడిక, వ్యక్తిత్వం ఆధారంగా స్నేహం మన జీవితంలోకి వస్తుంది. ఆపదలో ఆదుకుంటూ.. కష్టాల్లో పక్కనుంటూ.. ఎదుగుదలలో తోడుంటూ.. ఇలా రక్త సంబంధం చేయలేనిది కూడా స్నేహ హస్తం చేస్తుంది. మనం విజయం సాధించినప్పుడు చప్పట్లు కొట్టేవారు..విషాదంలో ఉన్నప్పుడు ఓదార్చేవాళ్లు నలుగురు లేని జీవితాన్ని ఎవరూ ఊహించలేరు. పని ఒత్తిడిలో సతమతమైనా, కుటుంబ బాధ్యతలతో భవిష్యత్తుపై భయం వేసినా ఉపశమనం కలిగించేది ఆత్మీయ మిత్రుల సందేశాలే. నేడు స్నేహితుల దినోత్సవం. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం...!

– ఇచ్ఛాపురం రూరల్/అరసవల్లి/శ్రీకాకుళం కల్చరల్



స్నేహగీతం.. సేవామార్గం



- ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్న స్నేహితులు
- మేమున్నామంటున్న ప్రవాసాంధ్రులు
- వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపు సభ్యులుగా మరికొందరి సేవలు
- నేడు స్నేహితుల దినోత్సవం

సేవల్లో అయ్యవార్లు

2018 డీఎస్సీలో ఎంపికైన శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు, కృష్ణ, ప్రకాశం, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన 160 మంది తెలుగు భాషాపండితులు ఆత్మీయ స్నేహితులుగా మారి 2019లో ‘తెలుగు సేవా సదన్’ సంఘాన్ని స్థాపించారు. ప్రకాశం జిల్లాకు చెందిన మాల్యాద్రి, పెద లక్ష్మయ్య అధ్యక్షతన 2023 ఆగస్టు 15 నుంచి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. వీరంతా వాట్సాప్ సమూహంతో ఆయా జిల్లాల్లో పేదరికంతో, అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు, కిడ్నీ బాధితులకు అండగా ఉంటూ వారికి ఆర్థిక సాయాన్ని అందిస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు ఎంతోమందికి సాయం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపి తోటి వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



దొంకూరు ఉన్నత పాఠశాల విద్యార్థి ముకుందరావు శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయ బృందం



కుమారుడిని కోల్పోయిన గిరిధర్‌శెట్టికి ఆర్థిక సాయం అందిస్తున్న గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు

ఊరికి ఉపకారులు..

ఆ గ్రామంలో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా మేమున్నామంటూ చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు ఇచ్ఛాపురం మండలం కేదారిపురం గ్రామానికి చెందిన ‘కేపీఎం గల్ఫ్ ఫౌండేషన్ గ్రూప్’. ఇందులో సభ్యులైన 80 మంది స్నేహితులు గల్ఫ్‌లో వలస కూలీలుగా పని చేస్తున్నారు. కేదారిపురం పంచాయతీలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఈ సంఘ సభ్యులు ముందుకు వచ్చి రూ.50వేలు వరకు సాయం అందిస్తూ ఆ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.



యోగా ఫ్రెండ్స్

యోగా కలిపింది అందరినీ..

శ్రీకాకుళం ఎల్‌బీఎస్ కాలనీలో పార్కులో ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తూ శారద, భారతి, పద్మశ్రీ, లిఖిత, స్వాతి, వనజ, తదితర 30మంది స్నేహితులయ్యారు. యోగాతో పాటుగా ఎన్నో సమాజ హిత కార్యక్రమాలు చేస్తుంటారు. భర్తలు చనిపోయిన భార్యలను ఆర్థికంగా ఆదుకోవడం, ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో మొక్కలు పెంచమని ర్యాలీ నిర్వహించడం, ప్లాస్టిక్ వాడకంపైన అవగాహనా ర్యాలీలు, బెహరా మనోవికాస కేంద్రంలోని చిన్నారులకు ప్రతినెలా వారికి తోచిన సాయం చేయడం, వారి పుట్టిన రోజులు జరుపుకోవడం వంటివి చేస్తుంటారు.

తెలుగు వారికి ఆపదొస్తే..

ఉన్న ఊరును, కన్నవారిని విడిచి ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకొని దేశం కాని దేశం వచ్చి కష్టాలు పాలైతే.. ఆదుకునేందుకు ముందుకు రాని ఈ రోజుల్లో తెలుగు వారంతా ఆప్త మిత్రులుగా మారి తోటివారికి ఆపన్న హస్తం అందించేందుకు పూనుకున్నారు పలువురు ప్రవాసాంధ్రులు. ఉపాధి పనులు కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి పోలెండ్ వెళ్లిన తెలుగు వారు స్నేహితులుగా మారి 2023లో పోలెండ్ శ్రీకాకుళం తెలుగు సంఘంగా ఏర్పడ్డారు. 250 మంది తెలుగు వారు ఏర్పాటు చేసిన ఈ సంఘంలో సభ్యుల సంఖ్య ప్రస్తుతం 360 మందికి చేరుకుంది. విదేశాలకు వెళ్లి మృతి చెందిన వ్యక్తి కుటుంబాలకు, అనారోగ్యంతో విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న కూలీల గురించి వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని అండగా నిలబడుతున్నారు.



వలసకూలి బుడత దామోదర్ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న పోలెండ్ తెలుగు సంఘం

నేస్తమా.. నువ్వే నా ధైర్యం

వీరి పేర్లు పి.ఢిల్లేశ్వరరావు (ఢిల్లీ), ఎం.శంకర్. కాళ్లు చేతులు పనిచెయ్యని, నడవలేని ఢిల్లీ లాంటి పూర్తి దివ్యాంగునితో 35 ఏళ్ల నుంచి స్నేహాన్ని కొనసాగిస్తున్న శంకర్ నిజంగా అభినందనీయుడే. జిల్లా కేంద్రంలోని కుమ్మరివీధి వద్ద ఉంటున్న ఢిల్లీ, మహాలక్ష్మినగర్‌లో ఉంటున్న శంకర్‌ల మధ్య స్నేహం చెక్కు చెదరనిది. అరసవల్లి మిల్లు కూడలి వద్ద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 వరకు ఇద్దరూ కలిసి చదువుకున్న రోజుల నుంచే పుట్టిన స్నేహం నేటికీ కొనసాగుతోంది. పుట్టుకతోనే దివ్యాంగుడైన ఢిల్లీకి ఇంట్లో తన వాళ్లు అన్నీ చూసుకుంటుంటే...బయట ప్రపంచాన్ని మాత్రం శంకరే చూపించాడు. సినిమాలకు సైతం ఢిల్లీని శంకరే వెంటేసుకుని థియేటర్లకు తీసుకెళ్తుంటాడు. ఢిల్లీతోనే తన టిఫిన్ దుకాణాన్ని ప్రారంభించి.. రోజూ తొలి టిఫిన్ ఢిల్లీకి ఇచ్చి..తర్వాతే మిగిలిన వారికి అమ్ముకుంటూ జీవనాన్ని గడుపుతున్న శంకర్‌కు నిజంగా హ్యాట్సాఫ్.



సరదాగా సెల్ చూస్తున్న ఢిల్లీ, శంకర్

మేమున్నామని..



1966 బ్యాచ్‌కు చెందిన సీనియర్ సభ్యులు

శ్రీకాకుళం మున్సిపల్ పాఠశాలలో 1965–66 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు నేటికీ సేవా కార్యక్రమాల్లో ముందుంటారు. కరోనా వంటి క్లిష్ట సమయంలోనూ పేదలకు బియ్యం, ఇతర ఆహార సామగ్రి అందించి అనేక కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. ఏటా శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నిర్వహించే నాటిక పోటీలకు ఆర్థికంగా తమవంతు సాయం అందిస్తున్నారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి రూ.1,33,967 అందజేశారు. బాపయ్య పంతులు, ఎల్.రామలింగస్వామి, జి.హయగ్రీవ రావు తదితర మిత్రులు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

సుఖీభవకు కోత.. అన్నదాతకు వాత

- పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రూ.20 వేలు ఇస్తామని మోసం
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ‘సుఖీభవకు కోత.. అన్నదాతకు వాత’ అనేలా సీఎం చంద్రబాబునాయుడు అన్నదాతలను మోసం చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ డాక్టర్స్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు అన్నారు. ఏడాది పాటు అన్నదాత సుఖీభవ ఇవ్వకుండా రూ.10,716 కోట్లు పూర్తిగా ఎగ్గొట్టారని మండిపడ్డారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నిస్సిగ్గుగా రైతులకు వచ్చి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. తల్లికి వందనంలో తల్లులు, పిల్లలను మోసం చేసినట్లే అన్నదాత సుఖీభవలో కూడా రైతులకు దగా చేస్తున్నారని మండిపడ్డారు. తల్లికి వందనం కూడా తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టి, రెండో ఏడాది కూడా రూ.15 వేలకు బదులు రూ.13 వేలు ఇస్తామని చెప్పి అది కూడా పూర్తిగా ఇవ్వకపోవడం దారుణమన్నారు. కేవలం రూ.8 వేలు, రూ.7 వేలు చొప్పున మాత్రమే జమ చేశారన్నారు. దాదాపు 30 లక్షల మందికి పథకంలో కోత పెట్టడం అన్యాయమన్నారు.

- ఎరువుల కోసం క్యూలైన్లలో పడిగాపులు పడుతున్నారని సీదిరి పేర్కొన్నారు. ధాన్యం సేకరణ తర్వాత 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో పైకం జమ చేస్తామని డప్పు కొట్టిన ప్రభుత్వ పెద్దల మాట నీటిమూటగా మిగిలిందన్నారు. రెండు నెలలు దాటినా డబ్బులు జమ కాక రైతులు ఎదురు చూస్తున్నారని చెప్పారు.
- రొయ్యల ధరలు పతనమైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదని సీదిరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.280 దాకా పలికితే ఇప్పుడు రూ.200, రూ.220 కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందన్నారు. మిర్చికి మద్దతు ధర కల్పించకుండా చంద్రబాబు ప్రభుత్వం దారుణంగా వంచించిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో క్వింటా మిర్చి ధర రూ.27 వేలు ఇచ్చామన్నారు. నేడు క్వింటా రూ.8 వేలు, రూ.10 వేలు కూడా పలకడం లేదన్నారు.
- విత్తనం నుంచి పంటల అమ్మకం వరకు రైతులకు తోడుగా నిలుస్తూ రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చేశామని సీదిరి గుర్తు చేశారు. ఉచిత పంటల బీమా అమలు చేయాలని, ఇన్‌పుట్ సబ్సిడీని తమ హయాంలో మాదిరిగా సీజన్ ముగిసేలోగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాలను పునరుద్ధరించాలని, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల కోసం రైతులు అగచాట్లు పడే దుస్థితి లేకుండా చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.
- వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలుకు ఫీడర్ల సామర్థ్యం పెంచేందుకు రూ.1,700 కోట్లు ఖర్చు చేశామని, ఆక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేశామని, సున్నా వడ్డీ పంట రుణాలు ఏ సీజన్లో పంట నష్టం జరిగితే, ఆ సీజన్ ముగిసేలోపే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు జరిగేదని గుర్తు చేశారు. ఇలా అనేక రకాలుగా రైతును చేయిపట్టి నడిపించేలా పాలన సాగిందన్నారు. ఐదేళ్లలో మొత్తంగా రూ.1,84,567 కోట్లు వెచ్చించామన్నారు. ఇప్పుడా వ్యవస్థలన్నీ చంద్రబాబు కూటమి ప్రభుత్వం విధ్వంసం చేసి వ్యవసాయం దండుగ అనే దాన్ని నిరూపిస్తున్నారని ధ్వజమెత్తారు.

‘వన్ స్టేషన్.. వన్ ప్రొడక్ట్’ స్టాల్ ప్రారంభం



రైల్వేస్టేషన్‌లో స్టాల్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

ఆమదావలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వే స్టేషన్‌లో రైల్వే శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ‘వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్’ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘ ఉత్పత్తుల విక్రయ స్టాల్‌ను సెర్ప్ గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ కిరణ్ కుమార్, స్టేషన్‌మాస్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు శనివారం ప్రారంభించారు. తాళ్లవలసకు చెందిన భరతమాత స్వయం సహాయక సంఘ సభ్యురాలు గండ్రెడ్డి కామేశ్వరి ఈ స్టాల్ నిర్వహిస్తారు. తినుబండారాలతో పాటు స్థానికంగా తయారైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. కార్యక్రమంలో డీపీఎం బి.నారాయణరావు, ఏపీఎం జి.నారాయణరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు టి.ధనలక్ష్మి, సీసీలు, వీవోఏలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

పీడీ–పీఈటీ సంఘ కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా పీడీ–పీఈటీల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగింది. అధ్యక్షుడిగా పట్ట తవిటయ్య, ప్రధాన కార్యదర్శిగా మొజ్జాడ వెంకటరమణ, కోశాధికారిగా కె.మాధవరావు, సహాధ్యక్షుడిగా బి.సురేష్, కార్యనిర్వాహక సెక్రటరీగా రెడ్డి రవి, జిల్లా హెడ్‌క్వార్టర్స్ సెక్రటరీగా ఆర్.సతీష్‌రాయుడు, ఇతర కార్యవర్గ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు మాస్టారు ప్రమాణస్వీకారం చేశారు.

వేటు పడింది!

- డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ సస్పెన్షన్
- ఏఎన్ఎం బదిలీల్లో అక్రమాలే కారణం

అరసవల్లి:



భాస్కర్‌కుమార్, సూపరింటెండెంట్

జిల్లా వైద్యారోగ్య శాఖ మరోసారి వార్తల్లోకి ఎక్కింది. తాజాగా జరిగిన గ్రామ/వార్డు సచివాలయాల ఏఎన్ఎంల బదిలీల్లో జరిగిన అక్రమాలకు బాధ్యున్ని చేస్తూ కార్యాలయ సూపరింటెండెంట్ డి.భాస్కర్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఏఎన్ఎంల బదిలీల్లో భారీగా డబ్బులు చేతులు మారడంతో పాటు జూమ్‌లోనే బదిలీలు చేపట్టడంపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈమేరకు సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలంటూ జూలై 31న వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ (విశాఖపట్నం)కు సిఫారసు లేఖను పంపించారు. దీనిపై ఆర్‌డీ డాక్టర్ పి.రాధారాణి స్పందిస్తూ.. భాస్కర్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లుగా శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి రావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అనితను ఆదేశించారు. గతంలో పలు వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడినట్లుగా భాస్కర్‌కుమార్‌పై ఆరోపణలున్నాయి. పలు అంశాల్లో విచారణ కూడా కొనసాగుతోంది.

అక్రమాలపై విచారణకు ఆదేశం..

జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాల్లో మొత్తం 605 మంది ఏఎన్ఎంల బదిలీల అంశంలో చాలా మందికి అన్యాయం జరిగిందని కలెక్టర్ దృష్టికి వచ్చింది. తమకు అన్యాయం జరిగిందని, అసలు ఖాళీల స్థానాలనుబహిర్గతం చేయకుండా నచ్చిన వారికి నచ్చిన స్థానాలకు బదిలీలు చేశారంటూ పలువురు కలెక్టర్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. సూపరింటెండెంట్‌పై వేటు పడటంతో పాటు అక్రమాలపై విచారణ కొనసాగుతుందని, అనంతరం శాఖాపరంగా చర్యలుంటాయని ఉన్నతాధికారులు తాజా ఆదేశాల్లో పేర్కొనడంతో స్థానిక కార్యాలయంలోని బదిలీల్లో పాత్ర పోషించిన మరో నలుగురిలో ఆందోళన మొదలైందని చర్చ జోరందుకుంది. ఇదిలా ఉండగా, సిఫారసు లేఖలిచ్చిన అధికార పార్టీ ఎమ్మెల్యేల అధికార అజమాయిషీకి సూపరింటెండెంట్ బలి అయ్యారంటూ చర్చ మొదలైంది.



జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయం

హైకోర్టు కౌంటర్ వ్యవహారంలో కూడా...

జిల్లా వైద్యారోగ్య శాఖలో ఉద్యోగుల పనితీరుపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఏఎన్ఎంల బదిలీల్లో అక్రమాలతో పాటు 2002 నాటి హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో భాగంగా హైకోర్టును ఆశ్రయించిన బాధితుల వ్యవహారంలో సెలక్షన్ కమిటీ చైర్మన్ (కలెక్టర్)కు నోట్ ఆర్డర్ పెట్టకుండా..అసలు ప్రొసీజర్ ఫాలో కాకుండా స్పీకింగ్ ఆర్డర్లు ఇవ్వడంపై కలెక్టర్ ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయ ఏఓ బాబూరావు, సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్‌తో పాటు సంబంధిత సీనియర్ అసిస్టెంట్ గీతలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. దీనిపై ఇద్దరిపై వివరణల సంతృప్తి చెందిన కలెక్టర్.. సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్‌పై మాత్రం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతలోనే ఏఎన్ఎంల అక్రమాల్లో భాస్కర్‌కుమార్‌పై వేటు పడింది.

సిక్కోలులో సౌత్ ఇండియా సొబగులు

- సరికొత్త షోరూమ్‌ను ప్రారంభించిన సినీ నటి నిధి అగర్వాల్



సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ను సంస్థ డైరెక్టర్లతో కలసి ప్రారంభిస్తున్న సినీ నటి నిధి అగర్వాల్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని జి.టి. రోడ్డులో సూర్యమహల్ ఎదురుగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ షోరూం సరికొత్త సొబగులతో శనివారం ప్రారంభమైంది. సినీ నటి నిధి అగర్వాల్ (హరిహరవీరమల్లు ఫేమ్) ముఖ్య అతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం నాలుగు ఫ్లోర్లలో వైవిధ్యమైన నూతన వస్త్రాలను తిలకించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పవిత్ర శ్రావణమాసంలో తెలుగువారి ముంగిళ్లలో జరిగే వరలక్ష్మి పూజలు, వివాహాది కుటుంబ వేడుకలను, వస్త్ర ప్రియుల అభిరుచిని దృష్టిలో పెట్టుకుని సిద్ధం చేసే సరికొత్త మోడల్స్ షోరూంలో అందుబాటులో ఉన్నాయన్నారు. శ్రీకాకుళం ప్రాంతం తనకు ఎంతగానో నచ్చిందని, ఇటీవల విడుదలైన హరిహరవీరమల్లు సినిమాలో తన నటనను ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో రాజాసాహెబ్ చిత్రం విడుదలవుతుందని చెప్పారు. అనంతరం షాపింగ్‌మాల్ ఆవరణలో ఏర్పాటుచేసిన డయ్యాస్‌పై ప్రేక్షకులకు అభివాదం చేస్తూ నృత్యం చేశారు.

- సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సంస్థల డైరెక్టర్లు శ్రీ సురేష్ శీర్ణ, అభినయ్, రాకేష్, కేశవ్‌లు మాట్లాడుతూ షాపింగ్‌మాల్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడం ఆనందంగా ఉందన్నారు. వివాహాది శుభకార్యాలకు భారతీయ సంప్రదాయ కలెక్షన్లకు తమ షోరూం ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు.

క్లుప్తంగా

మెడికల్ స్టోర్‌లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యుడు

కంచిలి: మండలంలో మఠం సరియాపల్లి గ్రామంలోని మెడికల్ స్టోర్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని హనుమాన్ జంక్షన్‌లో ఉన్న మెడికల్ స్టోర్‌లో రూ.30 వేల నగదును అగంతకుడు దొంగిలించాడు. షాపు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి దొంగతనం చేశారు. దొంగతనం చేసిన వ్యక్తి షాపు వద్దకు వచ్చినప్పుడే గొడుగు అడ్డుగా పెట్టుకొని ప్రవేశించి, తర్వాత సీసీ కెమెరా వైర్లను కట్‌చేశాడు. తర్వాత షాపులోకి ప్రవేశించి శుక్రవారం రోజున అమ్మకాలు జరిపి భద్రపరిచిన రూ.30 వేల నగదును చోరీ చేసినట్లు బాధిత మెడికల్ స్టోర్ యజమాని అడ్నాల నాని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో సోంపేట సీఐ బి.మంగరాజు శనివారం వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం శ్రీకాకుళం నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు. దీనిపై కంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

టెక్కలి రూరల్: ఒడిశా నుంచి అక్రమంగా 23.025 కేజీల గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గంజాయి రవాణాపై వచ్చిన ముందస్తు సమాచారం మేరకు టెక్కలి పోలీసులు రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే మార్గంలో వాహన తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా పద్మపూర్ పరిధి తెంబ గూడ, మిల్కాపంగా గ్రామాలకు చెందిన రచనా లియా, ఆకాష్ ఘంటా, తారా కుమారి బర్ధాన్ అనే ముగ్గురు వ్యక్తులు మూడు బ్యాగుల్లో 23.025 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారని వెల్లడించారు. ఈ గంజాయిని రాయఘడ జిల్లా సుందరిగూడకు చెందిన బిడికి రమేష్ అనే వ్యక్తి, మహారాష్ట్రలోని అకోలా జిల్లా హరిహరపేటకు చెందిన గోకుల్‌చంద్రాకు అప్పజెప్పేందుకు ఈ ముగ్గురినీ వినియోగిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. మిగిలిన ఇద్దరు వ్యక్తులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మెళియాపుట్టి: కరెంట్ షాక్‌తో ప్రైవేట్ లైన్‌మెన్ మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం గొడ్డ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొడ్డ గ్రామానికి చెందిన ప్రైవేట్ లైన్‌మెన్ కోరాడ షణ్ముఖరావు (67) గ్రామంలోని ఒక ఇంట్లో ఎర్త్ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ సరఫరా రావడంతో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే గ్రామస్తులు మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కొంతకాలం క్రితం ఒక్కగానొక్క కుమారుడు రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలుస్తోంది.

జవాన్ బలవన్మరణం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 3వ వార్డు శివాజీనగర్‌కు చెందిన బద్రి ఈశ్వరరావు (38) శనివారం బలవన్మరణం చెందాడు. జవాన్ (ఐటీబీపీ)గా పనిచేస్తున్న ఈయన సెలవుపై ఇంటికి వచ్చి ఉన్నారు. అయితే శనివారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉరివేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత రెండు రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ ఉన్నాడని, అందుకే బలవన్మరణానికి పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

జ్వరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలి



కొనకలో వైద్యారోగ్య సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో అనిత

కంచిలి: వర్షాకాలం నేపథ్యంలో జ్వరాలపై పీహెచ్‌సీల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.అనిత సూచించారు. మండలంలోని గిరిజన గ్రామమైన కొనకలో ఇటీవల మలేరియాతో పదమూడేళ్ల బాలిక గాయత్రి దొండియా మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఆమె కొనక గ్రామానికి శనివారం మధ్యాహ్నం వెళ్లి, బాధిత కుటుంబాన్ని కలిసి వివరాలను సేకరించారు. అనంతరం గ్రామంలో జ్వరాలు వ్యాప్తి, పారిశుద్ధ్యంపై ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఈ గ్రామంతోపాటు చుట్టుపక్కల ఉన్న గిరిజన గ్రామాల్లో కూడా పారిశుద్ధ్య పరిస్థితులను అధ్యయనం చేసి, అవసరమైన మెడికల్ సహాయాన్ని అందించాల్సిందిగా మఠం సరియాపల్లి పీహెచ్‌సీ సిబ్బంది, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.లక్ష్మీనారాయణకు ఆదేశించారు. అనంతరం కంచిలి, మఠం సరియాపల్లి పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఆమెతోపాటు ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవందిత, సీసీ విజయ్‌కుమార్, కంచిలి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.హరిబాబు తదితరులు ఉన్నారు.

పనుల్లో జాప్యం..

ప్రగతికి అవరోధం!



శ్రీకాకుళం రూరల్ మండలంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయం, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్ భవనాలు

- జిల్లాలో 2,373 ప్రభుత్వ నిర్మాణాలకు గత ప్రభుత్వం చర్యలు
- 80 శాతం పనులు పూర్తి
- మిగిలిన 20 శాతం పనులకు అడ్డం పడుతున్న కూటమి సర్కార్
- పల్లెల్లో అసంపూర్తిగా 625 భవనాలు

ఇదీ భవనాల పరిస్థితి..

మొత్తం గ్రామ సచివాలయాలు	656
వినియోగంలోకి వచ్చిన భవనాలు	394
ఇంకా పనులు పూర్తి కాని భవనాలు	208
భవనాలకు వెచ్చించిన ఖర్చు	రూ.208.6 కోట్లు
మొత్తం రైతు భరోసా కేంద్రాలు	652
వినియోగంలోకి వచ్చిన భవనాలు	289
ఇంకా పనులు పూర్తి కాని భవనాలు	205
భవనాలకు వెచ్చించిన ఖర్చు	రూ.91.32 కోట్లు
మొత్తం విలేజ్ హెల్త్ క్లినిక్స్	536
వినియోగంలోకి వచ్చిన భవనాలు	145
ఇంకా పనులు పూర్తి కాని భవనాలు	212
భవనాలకు వెచ్చించిన ఖర్చు	రూ.21.32 కోట్లు

కొన్ని చోట్ల కోర్టు కేసులు కారణంగా పనులు మొదలు కాలేదు

అరసవల్లి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడకముందు.. అంటే 2019కి పూర్వం వరకు రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా బడి, గుడి, అంగన్‌వాడీ కేంద్రాలు, అక్కడక్కడా వైద్యశాలలు మినహా..మరే ప్రభుత్వ భవనాలు కనిపించేవి కావు. అదే 2024 ఎన్నికలు జరగకముందు వరకు అంటే మధ్యలో ఐదేళ్ల జగనన్న పాలనలో ప్రతి పల్లెలోనూ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ తదితర భవనాలతో పల్లెల్లో సరికొత్త కళ కనిపించింది. దాదాపుగా అన్ని పంచాయతీల్లోనూ ప్రభుత్వ భవనాలు నిర్మాణం జరగడంతో గతంలో ఎన్నడూ చూడని పల్లె ప్రగతి కనిపించింది. ప్రభుత్వ ఉద్యోగులు నేరుగా సచివాలయాల్లో విధులకు రావడంతో ప్రత్యేక సందడి నెలకొంది. తర్వాత వచ్చిన కూటమి పాలకులు వీటిపై నిర్లక్ష్యం వహించడంతో పరిస్థితి దారుణంగా తయారవుతోంది.

ప్రగతిని అడ్డుకునేందుకే కుట్ర..!

జిల్లా ఏర్పడి ఈ నెల 15 నాటికి సరిగ్గా 75 ఏళ్లు నిండనున్నాయి. గతంలో కనీవినీ ఎరుగని రీతిలో పల్లెల్లో అభివృద్ధి, ప్రగతి దర్శనమిచ్చాయి. వేలాది ప్రభుత్వ భవనాల రాకతో పాటు వేలాది రకాల పౌర సేవలు కూడా ఉచితంగా అక్కడికక్కడే అందేలా వ్యవస్థ అమల్లోకి వచ్చింది. ఇంతటి బృహత్తర వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. ముందుగా వలంటీర్ల వ్యవస్థను నిలిపివేసి తద్వారా డోర్‌టుడోర్ సంక్షేమ పథకాల అమలుకు బ్రేక్ వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ఆందోళనల అనంతరం సచివాలయాల ఉద్యోగులతో ఇంటింటికీ పింఛన్లు వంటి పథకాల అమలు చేపడుతోంది. గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు కూడా కూటమి సర్కార్ బ్రేక్ వేసింది. దీంతో చాలావరకు భవనాలు అసంపూర్తి పనులతో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజల బాగోగులు కోసం ఈ ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై కుట్రను వీడి త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

2,373 భవనాల నిర్మాణాలకు శ్రీకారం..

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్లతో పాటు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. దీంతో గ్రామాల్లో ప్రజలందరికీ అన్ని రకాల ప్రభుత్వ సేవలు వ్యయప్రయాసలు లేకుండా గ్రామ పంచాయతీల్లోనే అందేలా, చాలావరకు సమస్యలు పరిష్కరించేలా వ్యవస్థ అమలు చేసింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి తలపెట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో రూ.240 కోట్లతో 656 గ్రామ సచివాలయాలు, రూ.142 కోట్లతో 652 రైతు భరోసా కేంద్రాలు, రూ.95 కోట్లతో 536 విలేజ్ హెల్త్ క్లినిక్స్, రూ.53 కోట్లతో 354 బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లు, రూ.28 కోట్లతో 176 డిజిటల్ లైబ్రరీల భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో 2373 ప్రభుత్వ భవనాల నిర్మాణానికి రూ.559 కోట్ల నిధులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో దాదాపుగా 80 శాతం భవనాలు పూర్తి స్థాయిలో వినియోగానికి వచ్చేశాయి. ఇంకా 625 వరకు భవనాలు శ్లాబు పనులు పూర్తయి తర్వాత పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే గత ప్రభుత్వ బిల్లులన్నీ కాంట్రాక్టర్లకు దక్కకుండా కుట్రకు దిగింది. దీంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయే పరిస్థితులు దాపురించాయి. చాలా చోట్ల సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజీ హెల్త్ క్లినిక్స్ వంటి ప్రాధాన్యత భవనాలు అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. కొద్దిపాటి నిధులు కేటాయిస్తే అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలన్నీ పూర్తయ్యే అవకాశముంది.

వివాదాస్పదంగా రీ మోడల్ టెండర్



టెండర్‌కు హాజరవ్వని ఆసక్తిదారులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో పలు అభివృద్ధి పనుల కోసం నిర్వహించిన టెండర్లు వివాదాస్పదమవుతున్నాయి. తాజాగా అన్నదాన ప్రసాదశాల రీ మోడల్ చేయడానికి, రంగులు వేయడానికి, మూడు ద్వారాలు ఏర్పాటు చేయడానికి, పైపులు, ఐరన్ గ్రిల్స్, ఫ్యాన్లు, లైటింగ్ పనులు చేయడానికి గానూ బహిరంగ వేలం/సీల్డ్ టెండర్ ప్రక్రియను శనివారం చేపట్టారు. అయితే ఈ టెండర్ ప్రక్రియకు ఈవో ప్రసాద్ హాజరుకాకపోవడంతో పాటు అసలు టెండర్ విధానమే నిబంధనలకు విరుద్ధంగా ఉందని, ఎలాంటి ఎస్టిమేట్లు లేకుండా టెండర్ ఎలా వేస్తారంటూ ఆసక్తిదారులు అధికారులను ప్రశ్నించారు. ఇదిలా ఉండగా ఇప్పటికే అన్నదాన మండపంలో రీ మోడల్ పనులు జరుగుతున్నాయని, సీలింగ్ పనులు, విద్యుత్ లైన్లు, పైపుల పనులు చేస్తున్నారని, వాటికి ఎలాంటి టెండర్ లేకుండా చేస్తూ ఈ చిన్న పనులకు టెండర్ ఇప్పుడెలా వేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై పర్యవేక్షణాధికారిగా వచ్చిన రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయ ఈవో గురునాథరావు, ఆలయ సూపరింటెండెంట్ సునీల్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణల సరైన సమాధానం చెప్పకపోవడంతో పలువురు కాంట్రాక్టర్లు వెనుదిరిగి వెళ్లిపోయారు. దీంతో ఆలయ సూపరింటెండెంట్ సునీల్, పర్యవేక్షక అధికారి గురునాథరావులు టెండర్ ప్రక్రియ వాయిదా పడినట్లుగా ప్రకటించారు. కాగా అన్నదాన మండపంలో ప్రస్తుతం జరుగుతున్న రీ మోడల్ పనులు ఏ ప్రాతిపదికన జరుగుతున్నాయో అనే అంశం ఇప్పుడు చర్చనీయాంశమైంది. దీంతో అన్నదాన మండపం రీ మోడల్ పనుల టెండర్ వివాదాస్పదంగా మారింది.

ఆదిత్యాలయంలో.. మళ్లీ విజిలెన్స్ దాడులు

- నిధుల వినియోగం, జీతభత్యాల చెల్లింపులపై ఆరా
- రికార్డులను తనిఖీ చేసిన విజిలెన్స్ సీఐ సతీష్



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ సతీష్ బృందం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి ఆదిత్యాలయంలో మరోసారి విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించడం కలకలం రేపింది. శనివారం ఉదయం 9 గంటల నుంచే ఆలయ కార్యాలయంలోకి వెళ్లిన విజిలెన్స్ సీఐ డి.వి.వి.సతీష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చల్లా ఎర్రంనాయుడులతో కూడిన విజిలెన్స్ బృందం అక్కడి పరిస్థితులప ఆరా తీసింది. 2012 నుంచి 2024 వరకు పనిచేసిన ఈవోల హయాంలో నాన్ రెగ్యులర్ ఉద్యోగ సిబ్బందికి చెల్లించిన జీతభత్యాల రికార్డులు, ఆలయానికి వచ్చిన నిధులు, చెల్లింపులు, ఖర్చులు, చెక్కుల రూపంలో చెల్లింపుల రికార్డులను పరిశీలించారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు వెంకటరమణ, అట్టాడ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, రిటైర్డ్ ఈవో జగన్మోహనరావు తదితరులు రికార్డుల పరిశీలనలో సహకరించారు. మరో రెండు రోజుల పాటు పరిశీలన కొనసాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద ఈ ఏడాది ఇప్పటికి మూడు సార్లు తనిఖీలు నిర్వహించడం గమనార్హం.

కృష్ణమాచార్యుల ఫిర్యాదు మేరకే...!

ఆదిత్యాలయంలో గతంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కృష్ణమాచార్యులపై పలు ఆరోపణల కారణంగా సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఆలయంలో జరిగిన పలు అక్రమాలపై ఆధారాలతో కూడిన ఫిర్యాదును కృష్ణమాచార్యులు నేరుగా విజిలెన్స్ అధికారులకు గతేడాది ఫిర్యాదు చేశారు. నకిలీ బిల్లులు, చెక్కులు జారీ, రెగ్యులర్ ఉద్యోగుల ఫోర్జరీ చెక్కులతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా డిప్యుటేషన్ ఉద్యోగులకు పీఆర్సీ చెల్లింపులు చేయడం వంటి అక్రమాలను అందులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే సుమారు 30 మంది సిబ్బందిని, దినసరి వేతనదారులను, కాంట్రాక్టు పనులు చేసిన వారిని విచారించారు. ఈ క్రమంలో అక్రమాలపై నిర్ధారణకు వచ్చారు. నకిలీ బిల్లులతో సుమారు రూ.2.50 కోట్ల వరకు ఆలయ నిధులు తినేశారంటూ గతంలో పనిచేసిన ఓ ఈవో, ఓ రిటైర్డ్ ఈవో, ఓ జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, మరో ఇద్దరు దినసరి వేతనదారులపై నేరుగా ఆధారాలతో ఫిర్యాదు నమోదు కావడంతో.. వీరందరినీ కూడా గత కొన్ని నెలల క్రితమే విజిలెన్స్ అధికారులు విచారించారు. అయితే రికార్డులను సైతం పరిశీలించేందుకు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫైళ్లన్నీ తెరిపించారు. అవసరమైతే రికార్డులను సీజ్ చేసేందుకు అధికారులు చర్యలకు దిగనున్నట్లు తెలుస్తోంది.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న గోవిందరావు మృతదేహం

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-2 ఆర్ఆర్ కాలనీకి చెందిన పెద్దకోట గోవిందరావు(49) శనివారం రాత్రి మండలంలోని నేరడి గ్రామానికి వెళ్లే దారిలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఎం డీ అమీర్ ఆలీ తెలియజేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు గోవిందరావు కుటుంబంతో పాటు 80 సంవత్సరాల వయస్సు ఉన్నటువంటి అతని అత్త పాపమ్మ నివాసం ఉంటోంది. అయితే అతడి అత్త పాపమ్మ తన ఆస్తి మొత్తం నష్టం చేశావని అల్లుడు గోవిందరావును అన్నది. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయి చెట్టుకు ఉరివేసుకున్నట్లు తెలుస్తోంది. అటువైపు వెళ్లిన ఒక వ్యక్తి చెట్టుకు వేలాడుతున్న గోవిందరావును చూసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. భార్య దశాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అడవి పందుల స్వైర విహారం



నాశనమైన చెరుకు పంటను చూపిస్తున్న రైతు

కొత్తూరు: మండలంలోని కుద్దిగాం, పానుటూరు, మాకవరం గ్రామాల్లో సాగు చేస్తున్న చెరుకు పంటను అడవి పందులు నాశనం చేస్తున్నాయి. చేతికందాల్సిన పంటను అడవి పందులు నాశనం చేస్తుండడంతో తీరని నష్టం జరుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అడవి పందుల కట్టడికి ఎన్ని చర్యలు తీసుకుంటున్నా సత్ఫలితాలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు చెరకు పంట నేలకొరగడంతో మరింత నష్టపోయినట్లు వాపోయారు. అందువలన చెరుకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

టీచర్లకు గుదిబండగా బోధనేతర పనులు

- తక్షణమే సమస్యలు పరిష్కరించాలి
- ఫ్యాప్టో ధర్నాలో సంఘ నాయకులు



ధర్నా చేస్తున్న ఫ్యాప్టో సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ కార్యక్రమాలు ఉపాధ్యాయులకు గుదిబండగా మారకూడదని, టీచర్ల సమస్యలు సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని ఫ్యాప్టో రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నిర్వహించిన ధర్నా శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బమ్మిడి శ్రీరామ్‌మూర్తి అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ జూన్‌లో బదిలీలు జరిగితే ఉపాధ్యాయులకు నేటికీ జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పీ-4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దడం సరికాదన్నారు. యాప్‌లు రద్దు చేస్తామని చెప్పి ఒకే యాప్‌లో అనేక కార్యక్రమాలు, ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించడంతో బోధనకు తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికగా ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ పడాల ప్రతాప్‌కుమార్ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, సీనియర్ నాయకులు టెంక చలపతిరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఫ్యాప్టో కో చైర్మన్‌లు వాల్తేటి సత్యనారాయణ, హరిప్రసన్న, ఎస్టీయూ అధ్యక్షుడు ఎస్.వి.రమణ, ఉపాధ్యాయ ఉద్యమాల సీనియర్ నాయకులు బొడ్డేపల్లి మోహన్‌రావు, బీటీఏ అధ్యక్షుడు రమేష్‌బాబు, ఆప్టా సీనియర్ నాయకులు రామారావు, యూటీఎఫ్ సీనియర్ నాయకుడు గొంటి గిరిధర్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బలివాడ ధనంజయరావు, ఏపీ ఎస్సీ ఎస్టీ యూఎస్ రాష్ట్ర కార్యదర్శి బోనెల రమేష్, ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏమైందో ఏమో..?

- రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య



హేమచంద్ మృతదేహం

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం వేకువజామున 3 గంటల సమయంలో రైలు కిందపడి పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన దేవళ్ల హేమచంద్(16) ఆమదాలవలస మండలం దన్నానపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం మెకానికల్ గ్రూపులో ఈ ఏడాది జాయిన్ అయ్యాడు. రెండో విడత కౌన్సిలింగ్ అనంతరం కాలేజీ మారుదామని ప్రయత్నం చేశాడు. అయితే మరెక్కడా సీటు రాకపోవడంతో ఆమదాలవలస పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో కొద్దిరోజులుగా ఉంటూ విద్యనభ్యసిస్తున్నాడు.



వసతి గృహంలో ఉండలేనని...

ఇక్కడ చదవడం ఇష్టం లేదని, వసతి గృహంలో ఉండలేనని మూడు రోజుల క్రితం విద్యార్థి తమ తల్లిదండ్రులకు చెప్పడంతో ఇంటికి తీసుకెళ్లి తండ్రి మణిభూషణరావు, తల్లి కుమారిలు తమ కుమారుడిని నచ్చజెప్పి మరలా వసతి గృహానికి పంపించారు. అయితే మృతుడు మళ్లీ శుక్రవారం తన తల్లిదండ్రులకు ఫోన్‌చేసి వసతి గృహం తనకు నచ్చలేదని, ఇంటికి వచ్చేస్తానని చెప్పినట్లు సమాచారం. ఇంతలోనే ఏమైందో తెలియదు కానీ మృతుడు వసతి గృహంలో శుక్రవారం రాత్రి భోజనం చేసి బయటకు వెళ్లిపోయాడు. తెల్లవారుజామున భువనేశ్వర్ వైపు వెళ్తున్న హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న హేమచంద్‌ను ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు కలిసి 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందినట్లు వెల్లడించారు. అయితే హాస్టల్‌లో ఉండాల్సిన విద్యార్థి బయటకు వెళ్లి ఆత్మహత్య చేసుకోవడంపై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం వలనే ఘోరం జరిగిందని వాపోతున్నారు.

కన్నీరుమున్నీరు

తమ కుమారుడు రైలు కిందపడి మృతి చెందిన విషయాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు ఇలా చేయడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగభూషణరావు మందరాడ గ్రామంలోని శివాలయంలో అర్చకత్వం చేస్తూ జీవిస్తున్నారు. రెండో కుమారుడిని శ్రీశైలంలోని వేద పాఠశాలలో చదివిస్తున్నారు. పెద్ద కుమారుడు టెక్నికల్ విద్యనభ్యసిస్తే కుటుంబాన్ని ఆదుకుంటాడని అనుకున్నామని వారు విలపిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టిస్తోంది. మరోవైపు తోటి విద్యార్థి మరణ వార్తలో హాస్టల్ విద్యార్థులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అచ్చెన్నా.. జిల్లాకు మీరు చేసిన మేలేంటి..?

- ఎన్నికల హామీలు ఏమయ్యాయి
- ధ్వజమెత్తిన పేరాడ తిలక్



టెక్కలి: జిల్లాలో పెద్ద పదవులు అనుభవిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు ఈ జిల్లాకు ఇన్నేళ్లలో చేసిన మేలేంటో చెప్పగలరా అని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ప్రశ్నించారు. ఈ మేరకు టెక్కలి పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. అధికారం కోసం ప్రజలను మోసం చేసిన కూటమి నాయకులంతా ఆలీబాబా దొంగల ముఠా అని దుయ్యబట్టారు. జిల్లాలో అచ్చెన్నాయుడు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ కేవలం బటన్ మాత్రమే నొక్కుతున్నారని విమర్శించిన కూటమి నాయకులు, ఇప్పుడు అదే బటన్ నొక్కి ఎందుకు సంక్షేమ పథకాలు ఇవ్వలేకపోతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను తెలియజేయడానికే బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

పథకాల్లో కోత విధిస్తున్నారు

సాంకేతిక కారణాలు సాకుగా చూపిస్తూ సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తున్నారని పేరాడ తిలక్ మండిపడ్డారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల్లో భారీగా కోత విధించారని దుయ్యబట్టారు. మహిళలకు ఉచిత గ్యాస్ ఇస్తామని చెప్పి పెద్ద ఎత్తున మోసం చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్ముకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడడం సిగ్గుచేటుగా లేదా అని నిలదీశారు. టెక్కలి నియోజకవర్గంలో మంత్రి సోదరుడు రైస్ మిల్లర్ల నుంచి పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. పీ-4 కార్యక్రమం ఒక పెద్ద బూటకమని, ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలో శివారు ప్రాంతాలకు సాగునీరు ఇచ్చుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. నందిగాం మండలంలో గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన విత్తనోత్పత్తి కేంద్రాన్ని ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. అంతేకాకుండా ఆయా పనులకు బిల్లులు సైతం ఆపేశారని గుర్తు చేశారు. టెక్కలిలో జిల్లా ఆస్పత్రి పరిస్థితి దయనీయంగా ఉందని, కనీసం మృతదేహాలకు భద్రత కూడా కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత సామాజికవర్గానికి చెందిన ఆర్డీవోతో అచ్చెన్నాయుడు తప్పులు చేయిస్తున్నారని మండిపడ్డారు. మూలపేట పోర్టు వైఎస్ జగన్ ఘనత, భూములు త్యాగాలు చేసిన ప్రజల గొప్పతనమని పేర్కొన్నారు. ఇప్పటికైనా గెలిపించిన ప్రజలకు మేలు చేసేందుకు అచ్చెన్నాయుడు కృషి చేయాలని సూచించారు.

ఏపీకి పెట్టుబడులు అంత ఈజీ కాదు

- కేంద్రమాజీ మంత్రి చింతా మోహన్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు రావడం అంత సులువు కాదని, అమరావతికి స్థల దోషం ఉన్నట్లు ఉందని, పెట్టుబడులు వస్తాయన్న నమ్మకం తనకైతే లేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక విమానాల్లో వెళ్లి ప్రత్యేక గదుల్లో ఉన్నా దానివల్ల ఉపయోగం లేదన్నారు. చంద్రబాబు ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతాడని, ఏపీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాడనుకున్నా.. చంద్రబాబు అంత బలాదూర్ ఈ ప్రపంచంలో ఎవ్వరు లేరని దేశమంతా అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని చేత ఒక్క మాట చెప్పించలేకపోయిన అసమర్థుడు చంద్రబాబు అని మండిపడ్డారు. రాజీవ్ గాంధీ ఏపీలో 35 వేల ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించగా.. కూటమి ప్రభుత్వం ఆ సంఖ్యను పది వేలకు కుదించాలని ఆలోచన చేస్తోందన్నారు. ఇప్పటికే 3 లక్షల మంది నిరుపేద విద్యార్థులు బడులకు దూరమయ్యారన్నారు. బీహార్ విషయంపై ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతున్నప్పుడు సీఐఎస్ఎఫ్ ఫోర్స్ పార్లమెంట్‌లోకి వెళ్లడం దారుణమని మోహన్ అన్నారు. మద్రాస్ రాష్ట్రం నుంచి ఏపీ విడిపోయినప్పుడు నెహ్రూ, ప్రకాశం పంతులకు తిరుపతిని రాజధాని చేయమని చెప్పిన గొప్ప నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న అని మోహన్ కొనియాడారు. రాజధాని అమరావతిని కర్నూలు నుంచి ప్రకాశం జిల్లా వరకు ప్రజలెవ్వరు స్వాగతించడం లేదన్నారు.